మొక్కలు నాటి సంరక్షించాలి

బోథ్: మొక్క నాటుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవికుమార్

ముథోల్: మొక్క నాటుతున్న ఎక్సైజ్, గౌడ సంఘం సభ్యులు

బోథ్, ఆగస్టు 3 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవికుమార్, సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ సూచించారు. శనివారం పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రకృతి ప్రేమికుడు షేక్ అలీ, ఉపాధ్యాయులు లింగంపల్లి సంతోష్, రమేశ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

బేల, ఆగస్టు 3 : గ్రామ పంచాయతీల్లో ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని మండల పంచాయతీ అధికారి వినోద్ సిబ్బందికి సూచించారు. సదల్‌పూర్ గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఖదీర్, గ్రామస్తులు, సిబ్బంది ఉన్నారు.

దిలావర్‌పూర్ ఆగస్టు 3: మండలంలోని కాల్వ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం వద్ద ప్రజాప్రతినిధులతో కలిసి తహసీల్దార్ స్వాతి మొక్కలు నాటారు. అనంతరం ఆలయంలో నర్సింహస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చైర్మన్, పండితులు తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పూజారం మహేశ్, ఆర్ఐ సంతోష్, డైరెక్టర్లు మహేశ్, శివ, ఆలయ పండితులు శ్రీనివాస్, వెంకటేశ్, రాము పాల్గొన్నారు.

ఇంటింటా మొక్కలు నాటాలి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 3 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కౌన్సిలర్ ఎడిపెల్లి నరేందర్ అన్నారు. నిర్మల్‌లోని బేస్త వారిపేట్ కాలనీలో మొక్కలు నాటారు. అనంతరం కాలనీ వాసులకు మొక్కలు పంపిణీ చేశారు.

మొక్కలు నాటడం ప్రతిఒక్కరి బాధ్యత

ముథోల్, ఆగస్టు 3 : మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా ముథోల్‌లోని ఎల్లమ్మ ఆలయ ఆవరణలో ఎక్సైజ్ అధికారులు ఈత మొక్కలు నాటారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు అంజి గౌడ్, ప్రవీణ్, దేవన్న, వెంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.

కారు బోల్తా: వృద్ధురాలి దుర్మరణం

ఎదులాపురం, ఆగస్టు 3 : మావల సమీపంలో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున ఓ కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శుభ్రంజు(70) మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఆదిలాబాద్ జిల్లా మావల సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న గుంతలో పడి బోల్తా పడింది. గమనించిన స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. గాయపడిన వ్యక్తి మృతురాలి భర్త సంజీవ్ గుర్తించారు.

ఆర్టీసీ బస్సు ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

ఎదులాపురం, ఆగస్టు 3: ఆదిలాబాద్‌లో ఆర్టీసీ బస్సు ఢీ కొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదిలాబాద్ బస్టాండ్ నుంచి గ్రామీణ మండలంలోని లోకారి గ్రామం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కుమ్రం భీం చౌరస్తా వద్ద జైనథ్‌కు చెందిన గొడుగుల రమణ(55)ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు.

జిల్లా పోస్ట్ మాస్టర్‌గా గంగాధర్

ఎదులాపురం, ఆగస్టు 3 : ఆదిలాబాద్ జిల్లా ప్రధాన తపాలా కార్యాలయం పోస్ట్ మాస్టర్‌గా గంగాధర్ నియమితులయ్యారు. ఆయన నిజామాబాద్ జిల్లా నుంచి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

బాధ్యతలు స్వీకరించిన పశు వైద్యశాల వైద్యులు

ఇంద్రవెల్లి, ఆగస్టు 3: ఇంద్రవెల్లి పశు వైద్యశాల వైద్యుడిగా రాథోడ్ సుభాష్, ముత్నూర్ ప్రైమరి పశు వైద్యశాల వైద్యుడిగా సుదేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది వీరిద్దరిని శాలువాలతో సన్మానించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

నార్నూర్, ఆగస్టు 3 : గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు అన్నారు. మండలంలోని ఖంపూర్, గోండుగూడ, ఖాతి గూడ గ్రామాల్లో గర్భిణులకు వైద్య పరీక్షలతో పాటు పిల్లలకు టీకా వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు చరణ్‌దాస్, ఏఎన్ఎం మాన్కుబాయి, ఈశ్వరి, విద్యారాణి, ఆశకార్యకర్త రాంబాబాయి, అంగన్‌వాడీ టీచర్ విజయ్‌లక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్, ఆగస్టు 1: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు డాక్టర్ రెడ్డి ల్యాబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు నెలల ఉచిత శిక్షణ, ఉపాధి సౌకర్యం కల్పించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోలార్ ప్యానెల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ వెహికల్ మెయింటెనెన్స్ టెక్నీషియన్‌కు ఎలక్ట్రికల్, మెకానిక్ ఐటీఐ, డిప్లొమా, ఫుల్ స్టాక్ డెవలపర్‌కు కంప్యూటర్ సైన్స్ బీసీఏ, బీఎస్సీ చేసి 18 నుంచి 28 సంవత్సరాలు కలిగి ఉంటే మూడు నెలల శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి అవకాశాలు కరీంనగర్, హైదరాబాద్ లాంటి పట్టణాల్లో ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల యువత ఆగస్టు 5 నుంచి 10వ తేదీలోపు ఐటీడీఏ కార్యాలయం ఉట్నూర్‌లో సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దానం నాగేందర్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలి

ఎదులాపురం, ఆగస్టు 3 : ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో వీధి రౌడీలా ప్రదర్శించి, మహిళా ఎమ్మెల్యేలను అవమానించిన దానం నగేందర్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మహిళా ఎమ్మెల్యేలు అని చూడకుండా నిండు సభలో అవమానించారని తెలిపారు. అదే సభలో మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ తన సాటి ఎమ్మెల్యేలపై అసభ్యకరంగా పదాలు వాడి కాంగ్రెస్ పార్టీ నైజాన్ని ప్రదర్శించారని పేర్కొన్నారు. దానం నాగేందర్ వెంటనే తెలంగాణ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఏజెన్సీలో బెల్ట్ షాపులు తొలగించాలి

ఇంద్రవెల్లి, ఆగస్టు 3: ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీలోని మండలంలో మద్యం బెల్ట్ షాపులను తొలగించాలని తుడుదెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, ఉపాధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సంబంధిత శాఖ అధికారులు తొలగించకపోతే తుడుందెబ్బ ఆధ్వర్యంలో మద్యం బెల్ట్ షాపులు బంద్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో తుడుందెబ్బ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దొరికిన సెల్‌ఫోన్ అందజేత

నిర్మల్ అర్బన్, ఆగస్టు 3 : నిర్మల్ బస్టాండ్‌లో ఓ బాధితుడు తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జయత్ రాం, కానిస్టేబుల్ అబ్దుల్ రెహమాన్‌కు దొరికింది. ఫోన్‌లోని వివరాల ఆధారంగా బాధితుని వివరాలు నిర్ధారించుకున్న తర్వాత అతడికి సెల్‌ఫోన్‌ను అందజేశారు. దొరికిన ఫోన్‌ను అందించిన పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయాలి

బోథ్, ఆగస్టు 3 : గ్రామాల్లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి, మండల ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో జీవన్ రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, ఆగస్టు 3: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఆర్‌సీ కుర్సెగ జంగు అన్నారు. నర్సాపూర్(బీ) గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న పారిశుధ్యం, నీటి గుంతలు పూడ్చడం, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేయాలన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమం ప్రతి నెల మూడవ శనివారం కొనసాగించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైనథ్, ఆగస్టు 3 : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిమ్మ పీహెచ్‌సీ వైద్యాధికారి సుచల అన్నారు. శనివారం పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సోన్, ఆగస్టు 3: ఈ నెల 5 నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం ప్రతి గ్రామంలో నిర్వహించాలని జడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. సోన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో కలీం, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

భైంసా టౌన్, ఆగస్టు 3 : స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో కోమల్‌రెడ్డి మండలాధికారులకు ఆదేశించారు. భైంసా ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. మండలాధికారులు ఆర్డీవోను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఆర్వో ప్రవీణ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుబీర్, జూలై 3: స్వచ్ఛదనం- పచ్చదనం క్యాక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి మనోహర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యక్రమ నిర్వహణ- బాధ్యతలపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఏపీవో రాథోడ్ హరిలాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, ఈజీఎస్ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎదులాపురం, ఆగస్టు 3 : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అజయ్, పవన్, బండారి సతీశ్ పాల్గొన్నారు.

ఖానాపూర్ రూరల్, ఆగస్టు 3 : ఖానాపూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో మండల చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ బాబురావు పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాలపై ప్రజలు అవగాహన కల్పించాలన్నారు. పలు అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నకర్ రావు, ఏపీవో రమేశ్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

అందరూ పాల్గొనాలి

ఖానాపూర్, ఆగస్టు 3 : ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో నిర్వహించే స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం సూచించారు. ఖానాపూర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం, పరిశుభ్రతతో పాటు ఐదు రోజులు చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో కమిషనర్ మనోహర్, సిబ్బంది రమేశ్, సంతోష్ పాల్గొన్నారు.

దస్తురాబాద్, ఆగస్టు 3 : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్ గౌడ్ కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో రమేశ్, ఎంపీవో రమేశ్ రెడ్డి, గ్రామాల ప్రత్యేకాధికారులు, ఏపీవో రవిప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మెడలోంచి బంగారు గొలుసు అపహరించిన దుండగులు

భైంసా, ఆగస్టు 3 : భైంసాలోని రాహుల్‌నగర్‌కు చెందిన బీ లక్ష్మీ నిర్మల్ చౌరస్తా వద్ద బస్సు దిగి రాహుల్ నగర్‌లోని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో నుంచి రెండు తులాల గొలుసును అపహరించుకొని పారిపోయారు. ఈ దృశ్యాలు నిర్మల్ చౌరస్తాలోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి. దుండగులు ముఖాలకు కర్చీఫ్ కట్టుకొని నంబరు ప్లేటు లేని వాహనంపై వేగంగా వెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో కనిపించాయి. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

వాహనాల తనిఖీ

నిర్మల్ అర్బన్, ఆగస్టు 3: నిర్మల్‌లోని పలు ప్రధాన కూడళ్లలో పోలీసులు శనివారం వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 50 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

కుబీర్, జూలై 3: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమైనదని బస్సులో ప్రయాణించి ఆర్టీసీకి అండగా నిలవాలని భైంసా డిపో డీఎం హరిప్రసాద్ సూచించారు. శనివారం కుబీర్‌లోని బస్టాండును సందర్శించారు. ప్రయాణికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా గార్డుతో పాటు క్లీన్ చేసేందుకు ఇద్దరు సిబ్బందిని ఇప్పటికే నియమించామని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

భైంసా, ఆగస్టు 3 : కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని భైంసా కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ అరుణ అన్నారు. శనివారం కోర్టు కార్యాలయంలో భైంసా డివిజన్ పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత కొత్త చట్టాలపై చర్చించారు. మహిళా సంరక్షణ చట్టాలు, తదితర విచారణ అంశాలపై సమీక్షించారు. సమావేశంలో సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఆర్జీయూకేటీ వీసీ

బాసర, ఆగస్టు 3 : డీజీపీగా కొత్తగా నియమితులైన జితేందర్‌ను బాసర వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరమణ శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర పిలుపుమేరకు డ్రగ్స్ రహిత సమాజం నెలకొల్పాలని ఉద్దేశాన్ని తీసుకెళ్లాలని ఆలోచనలో భాగంగా సున్నితత్వం గల విద్యార్థుల డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్, క్యాంపస్‌లో ర్యాగింగ్‌ను డీజీపీతో చర్చించినట్లు తెలిపారు.

ప్రయాణికులకు అనుగుణంగా ఆర్టీసీ సేవలు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 3 : ప్రయాణికులకు అనుగుణంగా ఆర్టీసీ సేవలు అందిస్తున్నదని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సాలోమాన్ అన్నారు. శనివారం నిర్మల్ డిపోలో గమ్యం యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ప్రైవేటు టీచర్లను కించపరచడం తగదు

భైంసా, ఆగస్టు 3 : ముఖ్యమంత్రి డిగ్రీ ఫెయిల్ అయినోల్లే ప్రైవేట్ టీచర్లని కించపరచడం మానుకోవాలని సామాజిక కార్యకర్త జాదవ్ పుండలిక్ రావు అన్నారు. విద్యావంతులైన ఎంతో మంది యువతి యువకులు ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్నారని, విద్యార్థులకు చక్కని విద్యాబోధన అందిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సింది పోయి ఉపాధి కల్పిస్తున్న ప్రైవేట్ పాఠశాలలను తక్కువ చేసి మాట్లాడడం ముఖ్యమంత్రి స్థాయికి తగింది కాదని ఆయన అన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలలను ప్రోత్సహించండి లేకుంటే విమర్శలు మానుకోవాలని ఆయన తెలిపారు.

ఆధ్యాత్మిక మార్గంతోనే మానసిన ప్రశాంతత

తలమడుగు, ఆగస్టు 3 : ఆధ్యాత్మిక మార్గంతోనే మానసిన ప్రశాంతత లభిస్తుందని తాజామాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పులాజి బాబా ధ్యాన కేంద్రం 27వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పులాజి బాబా కుమారుడు కేశవ్, బొల్లారపు బాబన్న, సోనేసింగ్, .పోశెట్టి, నారాయణ, అశోక్, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎన్పీడీసీఎల్ ఎస్ఈ

తలమడుగు, ఆగస్టు 3: వర్షాకాలంలో రైతులు విద్యుత్ వినియోగం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కరెంట్ ఆదాకు సంబంధించిన పాటించాల్సిన విషయాలపై ఆదిలాబాద్ విద్యుత్ శాఖ అధికారులు శనివారం తలమడుగు మండలం సుంకిడిలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీ శ్రవణ్, ఏఈ సతీశ్, రైతులు పాల్గొన్నారు.

సోనాలలో గంజాయి పట్టివేత

బోథ్, ఆగస్టు 3 : సోనాల గ్రామానికి చెందిన ఓంకార్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయిని శనివారం పట్టుకున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు. ఓంకార్ నడుపుతున్న కిరాణ దుకాణం వెనుకల కూలిన ఇంట్లో గంజాయి నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించారు. రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఓంకార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బోథ్, ఆగస్టు 3 : సైబర్ నేరగాళ్లు వివిధ రకాల లింకులు, మేసేజ్‌లు పంపుతూ ఖాతాలోని డబ్బులు కాజేస్తున్నారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాశెట్టి రాజ్‌కుమార్, సోనాల టీజీబీ మేనేజర్ నరేందర్ శర్మ సూచించారు. శనివారం సోనాలలోని టీజీబీ ఆవరణలో రైతులకు అవగాహన కల్పించారు. ఆర్థిక నేరాలు జరిగినప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తలు పాటించాలి

ఇచ్చోడ, ఆగస్టు 3 : సైబర్ నేరాలపై రైతులు జాగ్రత్తలు పాటించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సునీల్ మనోహర్ సూచించారు. ఇచ్చోడ ఎస్‌బీఐలో ఆర్థిక అక్షరాస్యత సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్లు , బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు

కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 3 : విద్యార్థులు జీవితంలో కష్టపడి చదివి ఉన్నత స్థానాలను చేరుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం నిర్మల్‌లోని సిటీ కన్వెన్షనల్ హాల్‌లో అల్ఫోర్స్ ఆవిష్కార్ పేరుతో కళాశాల విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గత సంవత్సరంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

ఇంద్రవెల్లి, ఆగస్టు 3: దుకాణాల్లో వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. శనివారం ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు సమస్యలు, పిల్లల పౌష్టికాహారం, బరువు తక్కువగా పుట్టిన చిన్నపిల్లల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలు ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సులోచనబాయి, నందబాయి, నైనత, అనిత పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

తాంసి, ఆగస్టు 3 : పొన్నారి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ ఇటీవల బదిలీ అయ్యారు. శనివారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విజయ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, నాయకులు లింగారెడ్డి, మాజీ సర్పంచ్ అండె అశోక్, ఆనంద్, రమణ, కీర్తి, హరివర్ధన్, ప్రవీణ్‌కుమార్, చంద్రయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం పకడ్బందీగా నిర్వహించాలి

కుంటాల, ఆగస్టు 3 : వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం కుంటాల మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో రహీం, డీటీ నరేశ్ గౌడ్, మెడికల్ ఆఫీసర్ శృతి రెడ్డి, ఎంఈవో ముత్యం, ఐకేపీ ఏపీఎం అశోక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

నేరడిగొండ, ఆగస్టు 3 : కొర్టికల్ గ్రామానికి చెందిన శివకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో బాధితున్ని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.

మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి చేస్తా

భైంసా, ఆగస్టు 3: మున్నూరు కాపుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శనివారం భైంసా పట్టణ మున్నూరు కాపు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సంఘ భవనం కోసం స్థలంతో పాటు భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన హయాంలో బీసీ కులాల సంక్షేమానికి పాటుపడడమే ధ్యేయం అన్నారు. ఇక్కడ మున్నూరు కాపు సంక్షేమ సమితి అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి ఆకుల గోపాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ బీ గంగాధర్, డాక్టర్ పోశెట్టి, మురళీధర్, గోపాల్ ఉన్నారు.

అవయవ దానం చేసి కొత్త వారికి జీవితాన్ని ఇవ్వండి

ఎదులాపురం, ఆగస్టు 3 : మరణానంతరం అవయవాలు, కణజాల దానం చేసి అవసరమైన వారికి కొత్త జీవితాన్ని ఇవ్వాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. అవయవ దానం దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఐసీపీఎస్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ కమిటీ సభ్యుడు దశరథ్, సిబ్బంది వైష్ణవి, పద్మ, వినోద్ కుమార్, ప్రేమ్ పాల్గొన్నారు.

పోస్టులు మంజూరు చేయండి

భైంసా, ఆగస్టు 3 : కుంటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బోధన,బోధనేతర సిబ్బంది, కుబీర్ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న సిబ్బందికి, తానూర్ జూనియర్ కళాశాల కోసం నూతన భవనం, మౌలిక వసతులు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ శృతిఓజా, జేడీ లక్ష్మారెడ్డి, ఆర్‌జేడీ జయప్రదను కలిసి విన్నవించారు. ఆయన వెంట వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్రూంలను వెంటనే లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి

భైంసా, ఆగస్టు 3 : డబుల్ బెడ్రూంలను వెంటనే తమకు స్వాధీనం చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. శనివారం భైంసా డబుల్ బెడ్రూం లబ్ధిదారుల సంఘం ఆధ్వర్యంలో డబుల్ బెడ్రూంల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్రూంలు నిర్మాణం చేసి గత సంవత్సరం లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. కాని ఇప్పటికీ లబ్ధిదారులకు అందించలేదని వెంటనే అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు, గిరధర్ జంగ్మే, సత్యనారాయణ, రాము, నహీం, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్ మెడికల్ సూపరింటెండెంట్ గా సురేశ్

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు,3: నిర్మల్ జిల్లా డీసీహెచ్ఎస్(టీవీవీపీ) మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ బీ సురేష్ బాధ్యతలు స్వీకరించారు. వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, ప్రిన్సిపాల్ జేవీడీఎస్ ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్లు వనజ, కమలమ్మ, విజయలక్ష్మి, వైద్య సిబ్బంది ఆయనను అభినందించారు.

స్వప్న దవాఖానలో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 3 : నిర్మల్‌లోని డాక్టర్స్ లేన్‌లోని స్వప్న మల్టీ సూపర్ స్పెషాలిటీ దవాఖానలో శనివారం ఉచిత కిడ్నీ వ్యాధుల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 142 మంది రోగులకు వైద్య, రక్త పరీక్షలు, స్కానింగ్, ఈసీజీ వంటి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో జనరల్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్, మల్లేశ్ యూరాలజిస్ట్, షహాజీ జాదవ్ నెఫ్రాలజిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

భవితకు బాసట 'ఎఫ్ఎల్ఎన్'

సోన్, ఆగస్టు 3: విద్యార్థుల భవితకు 'ఎఫ్ఎల్ఎన్' కార్యక్రమం ద్వారా బాసటగా నిలుస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం నిర్మల్ మండలం అనంతపేట్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి వీడియో ఫిల్మ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

తానూర్, ఆగస్టు 3 : పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్పీవో సుదర్శన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, పల్లె ప్రకృతి వనం, పారిశుధ్య పనులను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జాదవ్ జాలంసింగ్ ఉన్నారు.

469 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్

ఎదులాపురం, ఆగస్టు 3: ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాలలో డీఈఈసీఈటీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం మూడో రోజు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఆదిలాబాద్ డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ తెలిపారు. 550 మంది అభ్యర్థులకు గాను 469 మంది అభ్యర్థులు హాజరై తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారని 81 మంది హాజరు కాలేదని వివరించారు.

5న విద్యుత్ శాఖ ఉద్యోగుల ఎంపిక పోటీలు

ఎదులాపురం, ఆగస్టు 3: ఆదిలాబాద్‌లో ఈనెల 5న ఉమ్మడి జిల్లాస్థాయి విద్యుత్ శాఖ ఉద్యోగుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఎస్ఈ జయవంత్‌రావ్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. భుక్తాపూర్ కాలనీలోని పవర్ గెస్ట్ హౌస్‌లో ఉదయం 10 నుంచి 5 గంటల వరకు వాలీబాల్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. కుమ్రం భీం, నిర్మల్, మంచిర్యాల జిల్లాల క్యారం క్రీడాకారులు, వాలీబాల్ జట్ల వివరాలను పంపాలని కోరారు.

తప్పుడు ప్రచారంపై ఫిర్యాదు

ఎదులాపురం, ఆగస్టు 3: సోషల్ మీడియాలో తమ దవాఖానపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తిరుమల దవాఖాన వైద్యులు సందీప్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన యువకుడు శివ సోషల్ మీడియాలో తమ దవాఖాన గురించి దుష్ప్రచారం చేస్తున్నాడని పేర్కొన్నారు. ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. ఈ మేరకు వన్ టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన ఎంఈవో

ఎదులాపురం, ఆగస్టు 3: ఆదిలాబాద్ జిల్లాకు ఇటీవలే నూతనంగా ఎంఈవో బాధ్యతలు చేపట్టిన సోమయ్య శనివారం మాజీ మంత్రి జోగు రామన్న తన నివాసంలో కలిసి పూల మొక్కను అందజేశారు. వారిని సాదరంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు. కౌటల నుంచి ఆదిలాబాద్‌కు బదిలీ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

నాలుగు ఉద్యోగాలు సాధించిన ఈశ్వర్

ఎదులాపురం, ఆగస్టు 3 : ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌కు చెందిన పూర్వ విద్యార్థి సీహెచ్ ఈశ్వర్ టీజీపీఎస్సీ నిర్వహించిన జేఎల్ బాటనీలో రాష్ట్రస్థాయి 18వ ర్యాంకు సాధించారు. గతంలో సీఎస్ఐఆర్ ఎన్ఈటీ, జేఆర్ఎఫ్, టీఎస్ ఎస్ఈటీలో అర్హత సాధించి 2023లో నవోదయ విద్యాలయ పీజీటీగా తెలంగాణ గురుకుల జేఎల్, డీఎల్‌గా ఎంపికయ్యారు. ఆయన జైనూర్ మండలం పట్నాపూర్‌లో ఒక పేద కుటుంబంలో జన్మించారు. స్వశక్తితో నాలుగు ఉద్యోగాలు సాధించిన ఈశ్వర్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది, వృక్ష శాస్త్రం అధ్యాపకులు అష్రఫ్ అలీ, అధ్యాపకులు అభినందించారు.

పోస్టర్ విడుదల

ఎదులాపురం, ఆగస్టు 3 : ఆదిలాబాద్ జిల్లా వినియోగదారుల సంక్షేమ సంఘం తరఫున సీఏటీసీవో పోస్టర్‌ను రెవెన్యూ అదనపు కలెక్టర్ శామలాదేవి శనివారం తన ఛాంబర్‌లో సభ్యులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, జిల్లా. వినియోగదారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లుల సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు నాఖోడ్ రాజేశ్వర్ ఖత్రి , మునీశ్వర్. ప్రధాన కార్యదర్శి కేవీ రెడ్డి, సహాయ కార్యదర్శి శేఖర్ ,ఆర్గనైజింగ్ సెక్రటరీ దుట రాజేశ్వర్, కోశాధికారి సాయికుమార్, కార్యవర్గ సభ్యులు జాడి ప్రవీణ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PUBLIC HEALTH CHEMICALS
టెమీ ఫాస్ 50% EC, మలాథియన్ 50% EC, పైరిత్రమ్ 2% EC, డెల్టామెత్రిన్ 1.25% ULV, MLO ఆయిల్, పైరోసిన్ ఆయిల్ etc. మునిసిల్ కార్పొరేషన్స్‌కి, గ్రామ పంచాయతీలకి మరియు నగర పంచాయతీలకి సప్లై చేయబడును. డీలర్స్ మరియు మునిసిపల్ కాంట్రాక్టర్స్ సంప్రదించవలసిన నంబర్లు
9346771599, 8790185234, 9701298656

WANTED
jobs Apply Now!
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325779-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677